ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సూర్యాపేట
5
ఆదివారం 28 జూలై 2024



గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.60 (124.3222)	53,795	6,112
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (3.80)	1,002	353
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.04 (1.04)	69	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

లష్కర్లు ఏరీ?

ప్రాజెక్టులు నిండి కాల్వలకు నీటిని విడుదలచేస్తే వాటి నిర్వహణలో లష్కర్లది కీలక భూమిక. కాల్వల వెంట తిరుగుతూ ఎక్కడ గండిపడినా అధికారులకు సమాచారం ఇవ్వడం, నీటి చౌర్యం జరగకుండా అడ్డుకోవడం వీరి విధి. నీటి విడుదలకు ముందే ఎక్కడెక్కడ కట్టలు బలహీనంగా ఉన్నాయో గుర్తించి అధికారులను వీరు అప్రమత్తం చేస్తుంటారు. ఇంతటి కీలక విధులు నిర్వహించే లష్కర్ల పోస్టుల భర్తీని ప్రభుత్వాలు ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా నిర్వహణ లేక కాల్వలు బలహీనంగా మారాయి.
- నల్లగొండ



- చెరువుల పర్యవేక్షణ, నీటి విడుదలకు సిబ్బంది కొరత
- జలాశయాలకు గండిపడితే చూసే వారు కరువు
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని అధికారులు
- భారీ వర్షాలు వస్తే జలాశయాలకు పొంచివున్న ముప్పు

కృష్ణానది ఎగువ ప్రాంతాలైన కర్నాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో వరద ప్రభావం మొదలైంది. ప్రవాహం ఇలాగే కొనసాగి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగితే కాల్వలకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది. సాగర్ నిండితే ఆయకట్టులోని పలు చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేస్తారు. ఏఎమ్మార్పీ కింద ఉన్న చెరువులకు కూడా కృష్ణ జలాలు చేరుతాయి. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు నీరు చేరడంతో పాటు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కూడా చేశారు. డిండి ప్రాజెక్టుకు సైతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురిసే వర్షాలతో రానున్న రోజుల్లో వరద వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకం కిం ద పలు చెరువులను పునరుద్ధరించారు. దీంతో కొన్ని చెరువులు పటిష్టంగా అ యినా, మరికొన్ని చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ నుంచి నీటి సంవత్సరం మొదలైనా, ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతోజలాశయాల్లో నీరు చేరలేదు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే సాగర్ నిండితే చెరువులకు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే చెరువుల పటిష్టతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలతో వరదలు వస్తే చెరువులకు గండిపడే ముప్పు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 3,119 చెరువులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 3,119 చెరువులు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 1,628, సూర్యాపేట జిల్లాలో 1,224 చెరువులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 267 చెరువులు ఉన్నాయి. అయితే ఈ మూడు జిల్లాలో లష్కర్ల కొరత తీవ్రంగా ఉంది. చెరువులకు, ప్రాజెక్టులకు వచ్చే

ఎలాంటి సిబ్బంది కొరత లేదు

నీటి పారుదలశాఖలో వర్క్ చార్జెడ్ సిబ్బందికి సంబంధించి ఎలాంటి కొరత లేదు. గతంలో వీఆర్ఏలను వర్క్ చార్జెడ్ పోస్టింగ్‌లల్లో సర్దుబాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. జిల్లాలో ప్రస్తుతం చెరువుల్లో నీటిమట్టం మామూలుగానే ఉంది. సిబ్బంది నిరంతరం పనిచేస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు.
- ఎస్.పార్వతీశ్వర్‌రావు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, నీటి పారుదల శాఖ, నల్లగొండ

క్షేత్ర స్థాయిలో కీలక సిబ్బంది ఏరీ?

కొన్ని చెరువులను మిషన్ కాకతీయ పునరుద్ధరించినప్పటికీ చాలా చెరువులకు కట్టలు పటిష్టంగా లేవు. కాల్వల్లో కంపచెట్లు పెరిగినా తొలగించే వారు కరువయ్యారు. తూములు, డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో నీరు సాఫీగా సాగకుండా గండిపడే ప్రమాదాలు ఉన్నాయి. లష్కర్లు, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్ల కొరత అధికంగా ఉంది. నీటి పారుదల శాఖ పునర్ వ్యవస్థీకరణ అనంతరం చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈఈ, ఏఈల వరకు పోస్టులను సర్దుబాటు చేసినా, క్షేత్రస్థాయిలో సిబ్బంది అరకొరగానే ఉన్నారు.ప్రత్యామ్నాయంపై అధికార యంత్రాంగం చొరవ తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో సమస్యలు తీవ్రంగా ఉండనున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో 3,119 చెరువులు ఉండగా వర్క్ చార్జెడ్, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అంతా కలిపి 450మంది వరకు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇక మూడు జిల్లాలో హెల్పర్‌లు, లష్కర్లు మొత్తం సుమారు 327 మంది ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లాలో వర్క్ చార్జెడ్ సిబ్బందితో పాటు ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు మొత్తం 214మంది ఉండగా,హెల్పర్లు,లష్కర్లు 127మంది ఉన్నారు.

కొత్త పోస్టుల భర్తీ ఇప్పట్లో అసాధ్యమే!

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదలశాఖలో పోస్టుల భర్తీపై దృష్టి సారించలేదు. వివిధ గ్రూపుల పరీక్షల కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన తరువాతే ఈ పోస్టులు భర్తీకానున్నాయి. అయితే నోటిఫికేషన్ల జారీ ప్రస్తుతం లేకపోవడంతో ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. అయితే ముందుగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని జలాశయాలకు సంబంధించిన ఖాళీలను పూర్తిగా గుర్తించాల్సిన అవసరం ఉంది. అధికారులు మాత్రం సిబ్బంది కొరత లేదని చెబుతున్నా వాస్తవ పరిస్థితులను చూస్తే ఉమ్మడి జిల్లాలోని చెరువులు, కుంటలపై సిబ్బంది కొరత ఉంది. చాలా చెరువులను సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. చెరువుల పటిష్టత ఎలా విధంగా ఉందనే విషయాన్ని ఇప్పటి వరకు ఉన్నతాధికారులు పరిశీలించారనే దానిపై స్పష్టత లేదు. క్షేత్రస్థాయి సిబ్బంది చెబితేనే చెరువుల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటిని దిగువకు విడుదల చేసేందుకు ప్రతీ ప్రాజెక్టు వద్ద నిపుణులైన ఆపరేటర్ల అవసరం ఉంటుంది. సంబంధిత శాఖలో నిపుణులైన ఆపరేటర్ల కొరత ఉండటంతో ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడాల్సిన అవసరం ఏర్పడింది. అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారిలో ఎంతమందికి నైపుణ్యం ఉంది అనేది గుర్తించడం కష్టంగా మారింది. గత సంవత్సరం కూడా వీఆర్ఏలను లష్కర్లు, ఇతర సహాయకులుగా విధుల్లో చేర్చుకున్నారు. వీరిలో ఎవ్వరికీ సరైన శిక్షణ ఇవ్వలేదు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలన్నా నిబంధన ఉన్నా ఏళ్లుగా ఇది అమలుకు నోచుకోవడం లేదు. ఎవరైనా నిరుద్యోగులకు ఆసక్తి ఉంటే శిక్షణ ఇచ్చి నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ఆపరేటర్లను నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు. నీటి విడుదలకు ఎగువస్థాయి నుంచి ఆయకట్టు వరకు సిబ్బంది అవసరం. వారిలో లష్కర్లే కీలకం. అయినా సిబ్బంది కొరతను తీర్చాలన్నా ఆలోచన అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు కలగడం లేదు.



ఇటీవల సాగర్ నీటిని విడుదల చేయడంతో పెన్‌పహాడ్ మండలంలో పహారా కాస్తున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

సమస్యలే పాఠాలు



హుజూర్‌నగర్‌లో సీలింగ్ అస్తవ్యస్తంగా ఉన్న గురుకుల పాఠశాల

విద్యార్థులుంటే ఉపాధ్యాయులు లేరు.. ఉపాధ్యాయులుంటే విద్యార్థులు లేరు
మౌలిక వసతులు కరువై విద్యార్థుల ఇక్కట్లు

ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. ఓ పక్క మౌలిక వసతులు కరువై విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా, మరో పక్క విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేక, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యాశాఖలో ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం నిర్వహించినా పాఠశాలల్లో అవసరమైన చోట ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కాలేదు.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది. సుమారు అరడుగు మేర నీరు నిలుస్తోంది. ఇక్కడి చదువుతున్న 500 మంది విద్యార్థులకు కేవలం 10 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానపు గదులు కూడా సరిగా లేవు. తిరుమలగిరి మండలంలో విద్యార్థులు ఉన్నా సరిపడా ఉపాధ్యాయులు లేరు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేరు. డిండి మండలంలో గతంలో 46పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 22 పాఠశాలలకు విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేశారు. చిట్యాల మండలం వెలిమినేడు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సి వస్తోంది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాల భవనంలో ఒక తరగతి గదిలో పాఠశాల, మరో గదిలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.



హుజూర్‌నగర్‌లో గురుకుల పాఠశాల పైకప్పు కురుస్తుండటంతో బకెట్ పెట్టిన విద్యార్థినులు (ఫైల్)

•7లో..

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 27 : విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్ ప్రభుత్వం నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టీ నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ డిమాండ్ చేశారు. శనివారం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి ఉన్న విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని విమర్శించారు. సూర్యాపేట జిల్లాలో గురుకులాల్లో విద్యార్థులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1400 మంది విద్యార్థులు చదువుతున్నారని వారికి సరిపడా తరగతి గదులు లేవన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో అనేక సమస్యలుఉన్నాయని, విద్యార్థులు అరకొర వసతుల మధ్య ఉంటూ విద్యనభ్యసిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధర్నా వద్దకు రావాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘం నాయకులు కలెక్టరేట్‌లోని వెళ్లేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. పోలీసులు కలెక్టరేట్ గేట్లు మూసివేసి కలెక్టరేట్‌లోని వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం కలెక్టరేట్ ఏవో సుదర్శన్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వినోద్, వినయ్, శ్రవణ్, విష్ణు, తన్వేష్, అనిల్, సుమన్, నవ్య, శృతి, గోపి, సంధ్య, అభి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, జూలై 27 : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్యాకల్యాణాన్ని వేదపండితులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనృసింహమూర్తి, ఆంజనేయచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు జరిపించారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు పూర్తిచేశారు. ఉదయం హోమాధికాల భక్తిశ్రద్ధలతో చేశారు. తదుపరి కల్యాణమూర్తులను పరిణయోత్సవ వేదికపైకి అధిష్టింపజేసి మాంగళ్యధారణ, యజ్ఞోపవీతధారణ అనంతరం గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సూర్యాపేట రూరల్, జూలై 27 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ కోటా చలం అన్నారు. శనివారం మండలంలోని కేసారం గ్రామంలో పల్లె దవాఖానాను ఆయన పరిశీలించి, మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, అంటువ్యాధులు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, డాక్టర్ సుష్మ, అంజయ్య, ఉపేంద్ర, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

చివ్వెంల, జూలై 27 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం మండలంలోని గుంపులతిరుమలగిరి ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు అంగన్‌వాడీకేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఏ సబ్జెట్‌లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో ఉపాధ్యాయులు గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షల సమయం నాటికి ఉత్తమ ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాల్గో తరగతి విద్యార్థులు ఆంగ్లంలో, తెలుగులో ఏకలవ్య డ్రామాను కలెక్టర్‌కు చేసి చూపించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు వెంకన్న, లలిత కుమారి, అధికారులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

సూర్యాపేట(కలెక్టరేట్) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆర్డీవో, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం కలెక్టరేట్‌లో ఆర్డీవో, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు కేసులు, లోకాయుక్త కేసుల్లో ఉన్న వాటిపై తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ సోమవారం ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను పరిశీలించి శాఖల వారీగా పరిష్కరించాలన్నారు. ధరణి దరఖాస్తులను పరిశీలించకుండా తిరస్కరించవద్దని, తిరస్కరణకు గల కారణాలు కూడా దరఖాస్తుదారులకు తెలపాలన్నారు. రెవెన్యూ డివిజన్ వారీగా గ్రామాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా వాహనాలను సీజ్ చేసి ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు నివేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్‌లత, ఆర్డీవోలు సీహెచ్ సూర్యనారాయణ, డీ.శ్రీనివాస్, వేణుమాదవరావు, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, అంజనేయులు, హేమమాలిని, అదికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సూర్యాపేటలోని ఎస్వీ కళాశాలలో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ ఆథారిటీ చీఫ్ వసంత సత్యనారాయణ పిళ్లై

భానుపురి, జూలై 27 : డ్రగ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలు పెరుగుతున్నందున సెల్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా అవసరమని లీగల్ సర్వీస్ ఆథారిటీ చీఫ్ వసంత సత్యనారాయణ పిళ్లై అన్నారు. సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ వారితో మహిళా చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన చట్టాల ప్రాముఖ్యంపై వివరించారు. వాహనంపై వెళ్తున్నప్పుడు త్రిబుల్ రైడింగ్ ప్రమాదమని చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటరత్నం, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, షీటీం ఎస్ఐ నీలిమా, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పెండెం వాణి, న్యాయవాదులు దావుల వీరప్రసాద్, భరోసా కేంద్రం లీగల్ కౌన్సిలర్ జ్యోతి, వినోద, హేమలత, తేజస్వీని, సుజాత తదితరులు ఉన్నారు.

కోలాహలంగా తీజ్ పండుగ



తీజ్‌ను ఊరేగిస్తున్న యువతులు, మహిళలు

మఠంపల్లి, జూలై 27 : ప్రకృతిని పూజించే గిరిజనుల సంప్రదాయ పండుగ తీజ్ పండుగను శనివారం కోలాహలంగా జరుపుకున్నారు. మఠంపల్లి మండలంలోని భోజ్యాతండాలో మహిళలు, యువతీ, యువకులు ఆటపాటలతో తీజ్ బుట్టలతో ఊరేగింపు నిర్వహించారు. మృగశిర ఆరంభమయ్యాక పెద్దపూసల కార్తెలో జరుపుకోవడంతో ప్రకృతి కరుణించి పంట పొలాలు సమృద్ధిగా పండుతాయని, వర్షాలు సకాలంలో కురుస్తాయని, మూగజీవాలకు వ్యాధి సోకకుండా దేవతలు కాపాడాతారని నమ్మకంతో పూర్వకాలం నుంచి పండుగను జరుపుకుంటున్నట్లు గిరిజన పెద్దలు తెలిపారు. యువతులు, మహిళలు ఆటపాటలతో తీజ్ బుట్టలను ఎత్తుకుని ఊరేగింపుగా ఊరి పొలిమేరకు వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి బావులు, కుంటల్లో తీజ్‌ను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆయా తండాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గిరిజన సంఘం నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

మరో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



భానుపురి, జూలై 27 : ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతూ నిర్లక్ష్యం వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరి ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందించినట్లు డీఈవో అశోక్ ప్రకటనలో తెలిపారు. తుంగతుర్తి మండలంలోని బండరామారం ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పీ వెంకటరాములు(ఎస్‌జీటీ) ఈనెల 5 నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు అవుతున్నాడని, తుంగతుర్తి మండలంలోని నూనతండా ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పీ.సత్యమూర్తి(ఎస్‌జీటీ) ఈ నెల 3 నుంచి విధులకు గైర్హాజరు కావడంతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు. చివ్వెంల మండలం గుంపులతిరుమలగిరి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఎం.నాగమణి లీవ్ లెటర్ లేకుండా విధులకు గైర్హాజరుకావడంతో సస్పెండ్ చేశామన్నారు. ఇదే పాఠశాలకు చెందిన మరో ఇద్దరు ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు డీఈవో పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ఆర్. వెంకటయ్య(ఎస్ఏ సోషల్), ఉపాధ్యాయురాలు పీ జానకి(ఎస్ఏ హిందీ)లకు సైతం షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఈవో ప్రకటించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూలై 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శనహోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ఆలయఖజానాకు వివిధవిభాగాల ద్వారా రూ.19,79,989 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, పుదుచ్చేరి హోంమంత్రి తిరు ఏ.నమశ్శివాయన్ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఈవో భాస్కర్‌రావు శేషవస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రపటంతో పాటు లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న న్యాయమూర్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ.వేణుగోపాల్, టీ.వినోద్‌కుమార్, లక్ష్మణ్, కే.సుజన శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. న్యాయమూర్తులకు వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, స్వామివారి చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదాన్ని ఆలయ ఈవో భాస్కర్‌రావు అందజేశారు. అదేవిధంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సైతం స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు కొండపైన ఆయనకు ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి జినుకల శ్యాంసుందర్, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయనను కలిసినవారిలో డీఆర్డీవో ఎంఏ.కృష్ణన్ ఉన్నారు.



స్వామి వారి నిత్యకల్యాణోత్సవం, హైకోర్టు న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన ప్రభుత్వ విప్

యాదగిరిగుట్టలో నూతనంగా కోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ.వేణుగోపాల్, కే.సుజనను శనివారం ప్రెసిడెన్షియల్ సూట్‌లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థాన పరిధిలోని తులసీ కాటేజీలోని ఓ భవనంలో జూనియర్ సివిల్, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును విప్ పరిశీలించారు.

FARNAZ

సమస్యలే పాఠాలు

● విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెల ● విద్యార్థులు రాకపోతే ఉపాధ్యాయులు ఎదురు చూపులే ● నానాటికీ తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య


వెలిమినేడు బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక కూర్చున్న ప్రధానోపాధ్యాయురాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకప్పుడు తరగతుల నిండా విద్యార్థులు ఉండే వారు. సెక్షన్‌ల వారీగా విభజించి మరీ ఉపాధ్యాయులు పాఠాలు బోధించే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమ క్రమంగా తగ్గుతోంది. కొన్ని తరగతుల్లో కేవలం ఇద్దరు, ముగ్గురు విద్యార్థులే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వారి కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా పరిస్థితి మారడం లేదు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటిగా మాతపడుతున్నాయి.

విద్యార్థులులేక వెలవెల

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో 11జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 121మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 1,050మంది చదువు తున్నారు. 6వ తరగతి విద్యార్థులు 120 మంది, 7వ తరగతి విద్యార్థులు 218 మంది, 8వ తరగతి విద్యార్థులు 231మంది, 9వ తరగతి విద్యార్థులు 252, 10వ తరగతి విద్యార్థులు 230మంది నమోదైనట్లు మండల విద్యాశాఖ ఎన్‌రోల్‌మెంట్ రికార్డు చెబుతోంది. ఏపీలింగోటం, శాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 25కు మించలేదు. రెండు పాఠశాలల్లో 8మంది చొప్పున అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులున్నారు. ఏపీలింగోటం జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతిలో ఐదుగురు, 9వ తరగతిలో నలుగురు, 8వ తరగతిలో నలుగురు, 7వ తరగతిలో నలుగుగురు, 6వ తరగతిలో ఐదుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. శాపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతిలో ఏడుగురు, 7వ తరగతిలో ముగ్గురు, 8వ తరగతిలో 8మంది, 9వ తరగతిలో 8మంది, 10వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు.



నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం జడ్పీహెచ్‌ఎస్

విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల ఎదురు చూపులు

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులోని బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సి వస్తోంది. పాఠశాలలో రికార్డుల ప్రకారం పాఠశాలకు వలస కార్మికులకు చెందిన వారి పిల్లలు సుమారు 29మందికి పైగా పాఠశాలకు వచ్చేవారు. వారిలో చాలామంది ప్రస్తుతం పాఠశాలకు రావడం లేదు. అక్టోబరు మాసంలో తల్లిదండ్రులు తిరిగి గ్రామానికి వస్తే వారి పిల్లలను పాఠశాలకు పంపిస్తారు. పాఠశాలలో 1వ తరగతిలో విద్యార్థులు లేరు. 2వ తరగతిలో 21మంది, 3వ తరగతిలో ఇద్దరు, 4వ తరగతిలో నలుగురు, 5వ తరగతిలో ఇద్దరు, మొత్తం 29మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. హాజరయ్యేది మాత్రం ఇద్దరు విద్యార్థులే. వారిలో మూడో తరగతికి చెందిన ఓ విద్యార్థిని, ఐదో తరగతికి చెందిన మరో విద్యార్థిని ఉన్నారు. వారు గైర్హాజరైతే ఉపాధ్యాయులే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. లేకుంటే గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు బీసీకాలనీకి చెందిన 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 20మంది విద్యార్థులు జెడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్తున్నారు. జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్తే బీసీ కాలనీకి చెందిన విద్యార్థులను అదే కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు బదలాయిస్తే పాఠశాల పురోగతితో పాటు విద్యార్థులతో కళకళలాడుతుంది. పాఠశాల కూడా మూతపడే ఆస్కారం ఉండదు. బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండడంతో ఒక ఉపాధ్యాయురాలిని మండలంలోని సుంకెనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు.

మూత పడుతున్న ప్రభుత్వ పాఠశాలలు

డిండి: మండలంలో గతంలో 46పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 22 పాఠశాలలకు విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేశారు. ఇందులో కొన్ని పాఠశాలలు గతంలో మూతపడగా మరికొన్ని ఇటీవల మూతపడ్డాయి. ఈ విద్యాసంవత్సరం కొత్తతండా, బొగ్గులదొన ప్రాథమిక పాఠశాలల తోపాటు ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడింది. బొగ్గులదొన పాఠ శాలలో గత విద్యాసంవత్సరం 30మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం పాఠశాల మూతపడింది. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు వంతులవారిగా రావడం, సమయపాలన పాటించకపోవడం, విద్యా ప్రమాణాలు పడిపోవడంతో పాఠశాలకు తాళం పడింది. మండలంలోని ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాలలో మంది విద్యార్థులు, రుద్రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో 8మంది విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ చూపుతున్నారు. ఉన్నత పాఠశాలలలో టి.గౌరారంలో 5 తరగతులకుగాను 45మంది విద్యార్థులు, కామేపల్లి ఉన్నత పాఠశాలలో 55మంది విద్యార్థులు ఉన్నట్లు ఎన్‌రోల్‌మెంట్ నమోదై ఉంది. ఒక తరగతిలో 1 నిష్పత్తి 40 ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య ఐదు తరగతులు కలిపి 45కు తగ్గింది. క్రమంగా ఉన్నత పాఠశాలకు కూడ మూతపడే ప్రమాదముంది. ఏళ్ల తరబడి మండల విద్యాధికారుల నియామకం చేపట్టకపోవడంతో ఒక ఎంఈవో మూడు మండలాలలోని పాఠశాలలను పర్యవేక్షించాల్సి వస్తోంది.

బదిలీపై వెళ్లిన 33మంది ఉపాధ్యాయులు

ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టడంతో ఆ ప్రభావం మారుమూల పాఠశాలలపై పడింది. మండలంలోని 24ప్రాథమిక పాఠశాలల పరిధిలో 33 మంది ఉపాధ్యాయులు ఈ విద్యాసంవత్సరం బదిలీపై వెళ్లగా ముగ్గురు మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి విధుల్లో చేరారు. కొందరికి బదిలీ అయినా విద్యాశాఖ వారిని రిలీవ్ చేయలేదు.



తల్లిదండ్రులు వలస వెళ్లడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది

తల్లిదండ్రులు వలస వెళ్లడం వల్ల వారి పిల్లలను కూడా వెంట తీసుకొని వెళ్లారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. అక్కడి ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతాం.

● సామ్యనాయక్, ఎంఈవో.

పాఠాలు.. పంచాయితీలూ ఇక్కడే

తుర్కపల్లి: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాల భవనంలో పక్క పక్కనే రెండు తరగతి గదులు ఉన్నాయి. పాఠశాలలో 26మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఒక తరగతి గదిలో పాఠశాల, మరో గదిలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు తరగతులకు కలిపి ఒకే గది ఉండడంతో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులను వరండాలో, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను తరగతి గదిలో కూర్చొబెట్టి పాఠాలు బోధించాల్సిన పరిస్థితి. వర్షం వచ్చినప్పుడు జల్లులు విద్యార్థులపై పడుతున్నప్పుడు వరండాలో ఉన్న విద్యార్థులను కూడా తరగతి గదిలోనే ఉంచి అక్కడే పాఠాలు చెప్పాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గోడలపై వేసిన పేయింట్స్ వృథా

విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠాలు బోధించేందుకు రూ.10వేలతో ఓ తరగతి గదిలోని గోడలపై తెలుగు, ఆంగ్ల వర్ణమాల, గుణింతాలు, నంబర్స్ చార్ట్స్ వంటివి పేయింట్ వేయించారు. ఆ తరగతి గదిని గ్రామపంచాయతీ నిర్వహణకు ఉపయోగిస్తుండడంతో అక్కడ విద్యార్థులు కూర్చునేందుకు వీలు లేకపోవడంతో పేయింట్స్ విద్యార్థులకు ఉపయోగపడడం లేదని ఉపాధ్యా యులు తెలిపారు. మరోవైపు ఈ పాఠశాల ఆవరణలో ఉన్న మధ్యాహ్న భోజన వంటగదిలో పది సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తు న్నారు. మధ్యాహ్న భోజనం ఆరు బయటే వంటలు చేయాల్సి వస్తోంది.

అంతా గందరగోళం

తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేయడంతో బాబుల్‌నాయక్‌తండా గ్రామపంచాయతీగా ఏర్పడింది. గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణకు భవనం లేక పోవడంతో గ్రామస్థుల సూచన మేరకు ఐదుసంవత్సరాల నుంచి పాఠశాల భవనంలో ఓ గదిని కేటాయించారు. గ్రామసభలు, పింఛన్ల పంపిణీ, ప్రతినెలా వైద్య శిబిరం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు పాఠాలు బోధించడం కష్టంగా మారింది. గ్రామంలో జరిగే పంచాయితీలు కూడా ఇక్కడే నిర్వహిస్తుండడంతో అంతా గందరగోళంగా మారుతోంది. విద్యార్థులకు సరిపోను తరగతి గదులు నిర్మించి, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వేరే చోట ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రెండు గదులు.. పాఠశాల తరగతి గది, పక్కనే గ్రామపంచాయతీ కార్యాలయం

గురుకుల పాఠశాలలో అస్తవ్యస్తం

హుజూర్‌నగర్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠ శాల అస్తవ్యస్తంగా ఉండగా, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇక్కడ ఐదు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులు సుమారు 500 మంది వసతి పొందుతున్నారు. గురుకుల పాఠశాల భవనం లోని పైఅంతస్తులో రేకుల షెడ్డు ఉంది. మూడో అంతస్తులో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు వందమందికి పైగా ఇంటర్‌లో విద్యార్థినులు ఉండగా, ఆరు గదులే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదులు మొత్తం కురవగా, ఆరు గదుల్లో గోడల వెంట నీళ్లు కారడంతో పాటు రేకులకు మేకులు బిగించిన చోట పెద్ద మొత్తంలో నీరు కారి సుమారు అరడుగు మేర నిలిచింది. రాత్రిపూట నిద్రించే గదులు సైతం కురుస్తున్నాయి. 500 మందికి కేవలం 10 మాత్రమే మరుగు దొడ్లు ఉన్నాయి. స్నానపు గదులు కూడా సక్రమంగా లేవు. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు మూడో అంతస్తులో ఉన్న రేకులు లేచిపోయాయి. పదిరోజుల క్రితం వర్షం కురిసే సమయంలో ఆర్డీవో శ్రీనివాసులు ఈ పాఠశాలను పరిశీలించి భవన మరమ్మతులు చేసి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాలని యజమానికి చెప్పినా స్పందించడం లేదని విద్యార్థినుల తల్లిదం డ్రులు ఆరోపిస్తున్నారు.


గురుకులంలో ఊడిపోయిన సీలింగ్

టీచర్లు లేని చదువెలా

తిరుమలగిరిరూరల్: మండలంలోని తాటిపాముల, తొండ, వెలిశాల, జలాల్‌పురం, గుండెపురి, తిరుమలగిరి గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉండగా, 973 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తాటిపాముల, తొండ, తిరుమలగిరి ఉన్నత పాఠశాలలో మాత్రమే అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు ఉన్నారు. గుండెపురి, జలాల్‌పురం, వెలిశాల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో చదువెలా అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గుండెపురి ఉన్నత పాఠశాలలో సోషల్, ఇంగ్లీష్, తెలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందీ, బయోసైన్స్, పీఈటీ పోస్టులు ఇక్కడ లేవు. వెలిశాల ఉన్నత పాఠశాలలో గణితం, సోషల్ పోస్టులు, జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా ఖాళీలను భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక హరీష్ వాఖ్యలు : విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి అర్బన్, జూలై 27: కాంగ్రెస్ పాలనకు ప్రజాదరణ చూసి ఓర్వలేక మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తు న్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం శాసనసభలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు విప్ కౌంటర్ ఇచ్చారు. ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రజానికాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిన వాగ్దానాలను విస్మరించి కాంగ్రెస్ ప్రజాపాలనపై విరుచు కుపడటం సిగ్గుచేటన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి వంటి పథకాలు బీఆర్ ఎస్ హయాంలో అమలు కాలేదన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

వ్యవసాయంపై మంత్రులకు అవగాహనేలేదు: మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులకు సాగునీరు, వ్యవసాయంపై అవగాహనలేదని, కాళేశ్వరంపై బీజేపీతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ పేరుతో నాటకాలాడుతోందని మాజీమంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదులు ఆంధ్రా కోసమే పుట్టినట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. నీళ్ల ఎలా లిఫ్ట్‌చేయాలో తెలిసే కేసీఆర్ కన్నెపల్లివద్ద పంప్‌హౌస్ నిర్మించారని, మేడిగడ్డకు ఏదో జరిగిందని ఇప్పటి వరకు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మేడిగడ్డవద్ద 10లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని చెబుతోందన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, సింగూరు ప్రాజెక్టులు నీళ్లలేక ఎండిపోతున్నాయని, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో రైతులు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలి: సాంస్కృతిక సారధి సభ్యులు

వలిగొండ, జూలై 27: రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ సంస్కృతిక కళాకారుల సారధి శనివారం వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ కళాకారుల సమస్యలను సీఎంతో చర్చించి తమకు న్యాయం చేయాలని కళాకారులు కోరారు. కళాకారుల బృందం నాయకులు అంజనేయులు పాల్గొన్నారు.

రైల్వేప్లాట్‌ఫాంపై జాతీయపక్షి నెమలి కళేబరం

ఆలేరు రూరల్, జూలై 27: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులోని రైల్వే ప్లాట్‌ఫాంపై మృతి చెంది ఉన్న జాతీయపక్షి నెమలిని రైల్వే సిబ్బంది శనివారం గుర్తించారు. 2వ ప్లాట్‌ఫాంపైకి నెమలి ఎలా వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తు తెలియని రైలు ప్రయాణికుడు రైలు నుంచి పడవేసి ఉంటారని భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులకు విషయం తెలియజేసినా వారు ఆలస్యంగా స్పందించినట్టు తెలిసింది. చివరికి రైల్వేస్టేషన్‌కు వచ్చిన అటవీశాఖ అధికారులు నెమలి మృతదేహాన్ని తీసుకెళ్లారని రైల్వే పోలీసులు తెలిపారు. కాగా, పోస్టుమార్టం అనంతరం ఆలేరులో ఆ నెమలిని దహనం చేసినట్లు ఫారెస్ట్ అధికారి నిఖిత తెలిపారు.

నెమలిపై కోతుల దాడి

భువనగిరి టౌన్, జూలై 27 : భువనగిరి పట్టణంలోని కిసాన్‌నగర్ పార్కులోకి శనివారం సాయంత్రం నెమలి వచ్చింది. జనావాసాల మధ్య ఉన్న పార్కులోకి వచ్చిన నెమలిపై కోతులు అరుస్తూ దాడి చేస్తుండడంతో తప్పించుకునేందుకు నెమలి పార్కులోకి పరుగులు తీసింది. కోతులు, నెమలి శబ్దాలను విన్న స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు ఎండీ.అంజద్ వెంటనే అప్రమత్తమై కోతులను పారదోలాడు. అప్పటికే గాయపడిన నెమలిని అటవీ శాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి అప్పగించాడు. దీంతో అధికారులు నెమలికి ప్రాథమిక చికిత్స అందించారు. కోలుకున్నాక అడవిలో వదిలిపెడతామని పేర్కొన్నారు.


గాయపడిన నెమలితో అంజద్

లైన్‌మన్‌పై దాడి: కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, జూలై 27: చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్లసింగారం లైన్‌మన్ ఎలిజాల శ్రీనివాస్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లసింగారంలో వీధిలైట్లు ఎందుకు రావడం లేదని ఊదరి నర్సింహ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం లైన్‌మన్‌కు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ప్రశ్నించారు. అది తమ పరిధి కాదని మునిసిపాలిటీ సిబ్బంది చూసుకుంటారని లైన్‌మన్ తెలిపారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరగనుంది. ఈ క్రమంలో సర్వీస్ రోడ్డు ఫేమస్ బేకరి వద్ద ఉన్న లైన్‌మన్ శ్రీనివాస్‌పై నర్సింహతో పాటు అతని అనుచరులు దాడి చేశారు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు నర్సింహతోపాటు అతని అనుచలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుటుంబకలహాలతో మునిసిపల్ ఉద్యోగి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్, జూలై 27: కుటుంబ కలహాలతో యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపల్ ఉద్యోగి బలవన్మరణం చెందాడు. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకార.. మునిసిపల్ ఉద్యోగి దూడల నర్సింహగౌడ్(54) కుటుంబ కలహాలు భరించలేక శుక్రవారం రాత్రి తన ఇంట్లోని రేకులషెడ్‌లో ఉరి వేసుకున్నాడు. శనివారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు గమనించారు. అప్పటికే నర్సింహగౌడ్ మృత్యువాతపడ్డాడు. నర్సింహగౌడ్ కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా నర్సింహగౌడ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జవాన్ మహేష్‌కు ఘననివాళి

● భారీగా తరలివచ్చిన ప్రజలు
● మహేష్ అమర్‌హై అంటూ హోరెత్తిన నినాదాలు
● సైనిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

హాలియా, జూలై 26: దేశరక్షణ కోసం అస్సాంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన భారత జవాన్ అగ్నివీర్ ఈరేటి మహేష్ పార్థీవ దేహానికి సైనిక లాంఛనాలతో వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని సైనిక కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనంలో మహేష్ పార్థీవాన్ని హాలియా వద్దకు తీసుకువచ్చారు. పట్టణంలో సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతిమయాత్రలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామాల యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హాలియా పట్టణంలో ప్రారంభమైన యాత్రకు పెద్దవాగు బ్రిడ్జి వద్ద ప్రజలు స్వాగతం పలికారు. అనంతరం మెయిన్ సెంటర్ వరకు యాత్ర కొనసాగించి ప్రధాన సెంటర్‌లో మహేష్ గౌరవసూచికంగా రెండు నిమిసాలు మౌనం పాటించారు. అనంతరం మహేష్ స్వగ్రామమైన మదారిగూడెంలో సుమారు మూడు కిలోమీటర్ల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు మహేష్ అమర్‌హై, జై జవాన్, భారత్‌మాతాకీ జై అనే నినాదాలతో హోరెత్తించారు.

సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు

మహేష్ స్వగ్రామమైన మదారిగూడెంలోని మహేష్ వ్యవసాయ క్షేత్రంలో పార్థీవ దేహానికి సైనిక, ఎన్‌సీసీ అధికారులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైనికుల బృందం వారి సంప్రదాయ పద్ధతిలో గౌరవ సూచికంగా వందనం సమర్పించారు. విలపిస్తున్న మహేష్ తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వచ్చిన సైనికాధికారి జాతీయజెండాను అందజేశారు. అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు, బంధువులు, చిన్నారులు, మహిళలు, భావోద్వేగానికి గురయ్యారు.


మహేష్ పార్థీవ దేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

అంత్యక్రియలకు తరలివచ్చిన నాయకులు, ప్రముఖులు

అస్సాంలోని దబీర్‌ఘట్ ప్రాంతంలో భద్రత విధుల్లో ఉంటూ అనారోగ్యానికి గురై మృతి చెందిన మహేష్ అంతిమయాత్రంలో నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని మహేష్ పార్థీవానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సైతం మహేష్‌కు నివాళులర్పించి వారి తల్లితండ్రులను ఓదార్చారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్, బీజేపీ నాయకులు రిక్కల ఇంద్రసేనారెడ్డి, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, పిల్లి అంజనేయులు, వర్ర వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


హాలియాలో జవాన్ మహేష్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు


మహేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న సైనికులు

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు : డీటీఎఫ్

నల్లగొండ టౌన్, జూలై 27: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. సోమయ్య అన్నారు. విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు నల్లగొండ జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. 29రాష్ట్రాల్లో కేవలం తెలంగాణలో మాత్రమే విద్యారంగానికి సింగిల్ డిజిట్‌లో నిధులు కేటాయించి చిట్టచివరి రాష్ట్రంగా నిలిచిందన్నారు. డాక్టర్ డీఎస్ కోఠారి వంటి మేధావులు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని తమ రిపోర్ట్‌లో పేర్కొన్నా విద్యారంగానికి ప్రభుత్వాలు క్రమంగా కేటాయింపులు తగ్గిస్తున్నాయన్నారు. కనీసం 20శాతం నిధులు కేటాయించాలన్నారు. పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు ఆర్.విజయ్‌కుమార్, పి. వెంకులు, ప్రధాన కార్యదర్శి కె. రత్నయ్య, ఖుర్షీద్‌మియా, పి. ఏడుకొండల్, కాశయ్య, ఆర్. లక్ష్మయ్య, పీడీఎస్‌యూ బాధ్యులు జానీ, ఆనంద్, పీఎల్‌వై ఇందూరి సాగర్, విద్యావంతుల వేదిక బాధ్యుడు పందుల సైదులు ఉన్నారు.


క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

శాపల్లిలో 'అఖండం' ప్రారంభం

● 41 రోజుల పాటు గ్రామంలో దీపంతో ఊరేగింపు

నార్కట్‌పల్లి, జూలై 27: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లిలో ఆషాడంలో నిర్వహించే 'అఖండం' వేడుక శనివారం రాత్రి ప్రారంభమైంది. వందేళ్ల క్రితం పూర్వీకుల నుంచి సంక్రమించిన సాంప్రదాయాన్ని గ్రామస్థులు నేటికీ ఆచారంగా కొనసాగిస్తున్నారు. ఆధునిక వైద్య సౌకర్యం అందుబాటులో లేని సమయంలో అసలు ఏ రోగం వచ్చి మనుషులు చనిపోతున్నారో కూడా తెలియని రోజుల్లో మమ్మల్ని కాపాడమంటూ శాపల్లి గ్రామ పూర్వీకులు గ్రామ దేవతలను పూజిస్తూ ప్రారంభించిన ఉత్సవమే ఈ అఖండం. ప్రతి ఏటా ఆషాడం మాసం సప్తమి తిథిన గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న అఖండ దీపం వెలిగించి ప్రారంభిస్తారు. 41 రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం గ్రామంలో భజనలు, కోలాటాలతో దీపంతో ఊరేగింపు నిర్వహిస్తారు. కాగా ఈ అఖండ దీపాన్ని పట్టుకునే వ్యక్తి 41రోజుల పాటు నియమ నిష్టతో సాత్విక జీవనం గడపాల్సి ఉంటుంది. 41రోజుల అఖండం పూర్తైన తర్వాత గ్రామంలో కమలాద్రి లక్ష్మీనరసింహుని ఊరేగింపుతో దీపాన్ని తిరిగి ఆలయంలోకి చేర్చడంతో అఖండం వేడుక ముగుస్తుంది.


అఖండ ఉత్సవం నిర్వహిస్తున్న శాపల్లి గ్రామస్థులు

సారా రవాణా చేస్తే చర్యలు

హుజూర్‌నగర్, జూలై 27: సారా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవరి సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన 13 వాహనాలను శనివారం వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,15,000లు అని, కాని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 122శాతం అధికంగా రూ.2,56,296లకు 13వాహనాలను అమ్మినట్లు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ సారాకు అవసరమైన ముడి సరుకును రవాణా చేసినా, నిల్వ చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు. పలుమార్లు కేసులు నమోదైతే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి, ఎస్‌ఐ జగన్‌మోహన్ రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సృజన

మేళ్లచెర్వు, జూలై 27: సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నా రు. చింతలపాలెంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళలపై వివక్ష చూపారన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, భీమ్‌శెట్టి పద్మ, లక్ష్మీ, కళావతి, వీరమ్మ, అచ్చమ్మ, బుచ్చమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీసును పునరుద్ధరించాలి

సూర్యాపేటఅర్బన్, జూలై 27: జీవో 317లో భాగంగా పరస్పర బదిలీల్లో వచ్చిన ఉపాధ్యాయుల సర్వీసును పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయు జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరస్పర బదిలీలను పరిపాలన బదిలీలుగా భావించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత ప్రకారం కేటాయించకపోవడంతోనే పరస్పర బదిలీలలో ఆయా ఉపాధ్యాయులు జిల్లాలు మారాల్సి వచ్చిందని అన్నారు.

'నీటి విడుదలపై ప్రభుత్వం ప్రకటన చేయాలి'

హుజూర్‌నగర్, జూలై 27: ఖరీఫ్ నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ముల్కలపల్లి సీతయ్య కోరారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎడమ కాల్వకు నీరు విడుదల చేయాలన్నారు. సాగర్ ఆయకట్టుకు గత సీజన్‌లో రెండు పంటలకు నీరు రాక రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. శ్రీశైలంలో నీరు పుష్కలంగా ఉన్నందున సాగర్‌కు నీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తురక వీరయ్య, నాగేశ్వరరావు, శంభయ్య, బాలకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలి

హుజూర్‌నగర్, జూలై 27: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పి. రవి కోరారు. పట్టణంలోని టౌన్‌హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఆగస్టు 9న ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. మాదిగలను మోసం చేస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్, జానయ్య, ముక్కంటి, కోటయ్య, వెంకటేశ్వర్లు, రాము, రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులను విస్మరించిన ప్రభుత్వం

తిరుమలగిరి, జూలై 27: కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత కార్మికులను విస్మరించిందని చేనేత సంఘం నాయకులు వంగరి బ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలగిరిలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూత నిచ్చి ఆదుకోకుండా వారిని మరింత అప్పుల ఊబిలోకి లాగి, చేనేత మనుగడ ప్రశ్నార్థకంగా మారేలా చేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగరి సోమక్రిష్ణ, మద్దూరి ఉమేష్, రాపోలు కొండయ్య, వంగూరి రమేష్, సిద్ధిరాములు, కోమటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చిలుకూరు, జూలై 27: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఎస్టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురగాని లింగయ్య, అంకిరెడ్డి నాగిరెడ్డి, వెంకయ్య, రామాంజనేయులు, కొండా వీరబాబు, రామారావు, గురునాధరెడ్డి, పవన్‌కుమార్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వకుంటే మరోమారు ఉద్యమం

మఠంపల్లి, జూలై 27: ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలు నాయక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. మఠంపల్లి మండలంలో 2,700ఎకరాల భూములు ఉండగా, 24మందినే అర్హులుగా గుర్తించడం అన్యాయమన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో సర్వేచేసి భూములపై కబ్జాల్లో ఉన్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శానంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి నాయకులు కోటయ్య, రాము, వినోద్, సాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మృతి

కోదాడ రూరల్, జూలై 27: కోదాడ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీజర్ జాన్(60) శుక్రవారం రాత్రి మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతిపట్ల ఇంచార్జ్ ఎంపీడీవో రాంచందర్‌రావు, ఎంపీవో రంగయ్య, అనంతగిరి ఇన్‌చార్జి ఎంపీవో నాగేశ్వరరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది శనివారం నివాళులర్పించారు. సీజర్ జాన్ కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో ఐదు సంవత్సరాలకు పైగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్, జూలై 27: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ నెల 29న కోదాడలో ఏఐటీయూసీ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ముడుసు పాపారావు, జెట్టి ప్రసాద్, సత్యానందం, రమేష్, మల్లయ్య, సైదులు, నర్సింహారావు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


చివ్వెంల : మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు


మద్దిరాల : మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

చివ్వెంల, జూలై 27: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో స్కూల్ గార్డెన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా పూలమొక్కలు, ఆయిర్వేద మొక్కలు, హెర్బల్‌మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం మూలంగా వర్షం కురవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదాడటౌన్: విద్యార్థులు చదువుతో పాటు వివిధ అంశాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలని ఉపాధ్యాయులు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ న్యూట్రిషన్‌డే, ఎకో క్లబ్స్ మిషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలకు నీరు పోసి రక్షణ పెంపకం బాధ్యత విద్యార్థులకు అప్పగించడం, పాఠశాలలో ఆహారం, కూరగాయల కోసం కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల ఇన్ చార్జి హెచ్‌ఎం. మార్కండేయ తెలిపారు. కార్యక్రమంలో లింగయ్య, పూర్ణచంద్రరావు, రామకృష్ణ, పద్మావతి, సైదులు, నరసయ్య పాల్గొన్నారు.

మద్దిరాల: నాటి ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో నాటిన మొక్కలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బద్దం ఉమ, ఫీల్డ్ అసిస్టెంట్ మధు, పచ్చిపాల వెంకన్న, వంగూరి రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం: మొక్కలు ప్రాణకోటికి జీవనాధారమని ఎంపీడీవో ధార శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా నాగారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ హర్షవర్ధన్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల పర్యావరణం సమతుల్యత పెరిగి మానవ మనుగడకు ప్రాణాధారం అవుతాయని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, సిబ్బంది యాదగిరి, వినోద, కవిత, శోభరాణి, సరళ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనం రూ.18 వేలు ఇవ్వాలి


మఠంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

మఠంపల్లి, జూలై 27 : పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ రన్‌మియా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జీపీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు భూక్య సైదానాయక్, ఎం మైసయ్య, ఇంటి రవి, నాగయ్య, సైదులు, మంగ, దావీద్, గుర్వారెడ్డి, నరసింహారెడ్డి, దేవదానం, పాండునాయక్, ప్రభాకర్, శ్రీనివాస్‌రావు, బిచ్చా, ఏసు, చార్లెస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మునగాల రూరల్ : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న నిర్వహించే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నేలమర్రి పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మామిడి వెంకన్న, రాంపంగు సుందరయ్య, బచ్చలకూర నాగేంద్ర, పార్వతీ, పాపయ్య పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చెరుకు ఏకలక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకట్‌నారాయణ, ముత్యాలు, గురజాల తిరుపతమ్మ, వెంకటరమణ, తిరుపతమ్మ, సుజాత, బుజ్జి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానం


మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

కోదాడటౌన్, జూలై 27: కోదాడ లారీ అసోసియేషన్‌ను స్థాపించి 50 వసంతాలు అవుతున్న సందర్భంగా ఆగస్టు 5న కోదాడలో నిర్వహించే గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరుకావాలని ది కోదాడ లారీ అసోసియేషన్ నాయకులు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు కూడా హాజరవుతున్నారని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా లారీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. రామారావు, తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ ఆర్. శ్రీనివాసరావు, కోదాడ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మత్తుకు యువత బానిస కావొద్దు

సూర్యాపేటటౌన్, జూలై 27: యువత గంజాయికి బానిస కావొద్దని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నేటి యువత చెడుఅలవాట్లకు, వ్యసనాలకు అలవాటు పడుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఎక్కువ మొత్తంలో గంజాయి ఉంటుందని కొంత మంది యువకులు ధనార్జనే ధ్యేయంగా అడ్డదారిలో సులువుగా డబ్బులు సంపాదించవ చ్చునని వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. యువతకు అవగాహన కల్పించేం దుకు తన జన్మదినం సందర్భంగా గంజాయి నిర్మూలించాలని అవగాహన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, నాయకులు బొడ్డు శంకర్, తండు నాగరాజు, వీరేష్‌నాయక్, బాషబోయిన వేణు, బొమ్మగాని వినయ్, సందీప్‌గౌడ్, సతీష్, లక్కపాక నవీన్, యాకుబ్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్, మంగునాయక్, లోకేష్, అనిల్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం


కోదాడలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

కోదాడ టౌన్ / మద్దిరాల, జూలై 27 : దేశ శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఏపీజే అబ్దుల్ కలాం అందించిన విశిష్ట సేవలు చిరస్మరణీయమని కోదాడ పట్టణ ప్రముఖులు అన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా విజయీభవ ట్రస్ట్, స్వర్ణభారతి ట్రస్ట్, ముస్లిం మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్క్‌లో ఉన్న కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో స్వర్ణభారతి ట్రస్ట్ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, ఇరుకుళ్ల ఫౌండేషన్ అధ్యక్షుడు ఇరుకుళ్ల చెన్నకేశవరావు, యాద సుధాకర్, పుల్లకాండం సాంబశివరావు, గుడుగుంట్ల సాయి, పైడిమర్రి రామారావు, జగన్‌ప్రసాద్, రాయపూడి వెంకటనారాయణ, వెంపటి వెంకటేశ్వరరావు, రవి, ముస్లిం మైనార్టీ నాయకులు అలీబాయ్, జహీర్, నజీర్, జానీ, బాబా, దాదావలి, ముస్తాఫా, రఫీ, మజర్, ఉద్దండు, చోటు పాల్గొన్నారు. అదేవిధంగా మద్దిరాల మండలకేంద్రంలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సీపీఆర్‌పై పీహెచ్‌సీ మండల వైద్యాధికారి నగేష్‌నాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీఎం రాజేష్,ఏపీవో వెంకన్న పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీలు


సూర్యాపేటలో కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

సూర్యాపేట, క్రైం జూలై 27: జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రవి ఆధ్వర్యంలో టౌన్ సీఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి జిల్లాకేంద్రంలోని రాజీవ్ పార్కు, ఖమ్మం క్రాస్‌రోడ్, కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్, జనగాం క్రాస్ రోడ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు కుషలవ, బాలకృష్ణ, ఏఎస్ఐ ముత్తయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా సరైన పత్రాలులేని 156 వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మోతె సమీపంలో డ్రగ్స్ రవాణాను గుర్తించడానికి నార్కోటిక్ పదార్థాలు గుర్తించే ట్రైన్డ్ డాగ్ రోలెక్స్‌ను ఉపయోగించి తనిఖీలు నిర్వహించారు.

అర్హులైన రైతులందరి రుణాలు మాఫీచేయాలి

నూతన్‌కల్, జూలై 27: రాష్ట్రంలో ఉన్న రైతుల రుణాలను మాఫీ చేయడానికి రేషన్‌కార్డులతో సంబంధం లేకుండా చేయాలని సీపీఐ మండల నాయకుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ అయిందని రైతులు ఎంతోమంది ఆనందంలో ఉండగా తీరా బ్యాంక్‌కు వెళ్లి చూస్తే తమ పేరు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. కుటుంబంలో రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పట్టా బుక్‌తో రుణం తీసుకున్న ప్రతి రైతుకు మాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వెంకట్‌రెడ్డి, లింగయ్య, శ్రీరాములు, బిక్షం, అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి, జూలై 27: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో 11స్టాఫ్ నర్స్ పోస్టులకు కాంట్రాక్ట్, ఓట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో కోటాచలం శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'విద్యకు బడ్జెట్ పెంచాలి'

సూర్యాపేట టౌన్, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో 7.3శాతం నిధులను కేటాయించడం విద్యాభిమానులను నిరాశకు గురి చేసిందని విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రేపాక లింగయ్యసుబాని, కిరణ్, ఎల్. భద్రయ్య, హెచ్. వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు విద్యారంగానికి 20శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం. దశరథ, పి. వెంకటేశ్వర్లు, సిద్దిక్ పాషా, జి. వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, చర్లపల్లి వెంకటయ్య, నర్సయ్య, కోటయ్య, కరీం, నాగేందర్ నాయియక్, భరత్, సింహాద్రి, ఉమర్, జానయ్య, లాలయ్య, రవికుమార్, బిక్షం, నరసయ్య, ఎం. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తి..


హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలకేంద్రాల్లో బోనాలు ఎత్తుకొని విద్యార్థులు అలరించారు. పోతురాజు వేషాలతో ఆకట్టుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అందరూ అష్టైశ్వరాలు కలిగి సుఖశాంతులతో ఉండాలని ఉపాధ్యాయులు అన్నారు. తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలసభను నిర్వహించారు.


తిరుమలగిరిలో..


గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో బోనాలు ఎత్తుకున్న విద్యార్థులు

మఠంపల్లి పీఎస్ హోంగార్డు మృతి



మఠంపల్లి, జూలై 27: మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు షేక్ జానీ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. నాలుగు రోజులుగా అనారోగ్యం, జ్వరంతో బాధపడుతున్న ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతికి హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ రామాంజనేయులు, మండల పోలీసులు సంతాపం తెలిపారు.

ముగిసిన టైప్‌రైటింగ్ పరీక్షలు

సూర్యాపేటఅర్బన్, జూలై 27: సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టైప్‌రైటింగ్ పరీక్షలు శనివారం ముగిసినట్లు టైప్ రైటింగ్ శార్ట్‌హ్యాండ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత పొందుతారని తెలిపారు. 300 మంది పరీక్ష రాశారని ఆయన తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

నేరేడుచర్ల, జూలై 27: మండలంలోని పెంచికల్‌దిన్న జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంలో 9,10వ తరగతుల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శనివారం క్లాసులు నిర్వహించారు. ట్రైనర్ మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనడానికి అవసరమైన నైపుణ్యాన్ని అందరూ అలవర్చుకోవాలన్నారు. చిన్నతనం నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ లక్ష్య సాధన దిశగా కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుడి మృతికి సంతాపం

నాగారం, జూలై 27: మండలంలోని నాగారం బంగ్లా గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు బుర్రి బుచ్చిరెడ్డి(50) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఆకుల బుచ్చిబాబు, తోడుసు లింగయ్య, యల్మకంటి సోమన్న, పానుగంటి నర్సింహరెడ్డి, పాశం యాదవరెడ్డి, ముకుందారెడ్డి, బయ్యం వెంకన్న, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య, ఈదుల కిరణ్, దోమల బాలమల్లు, మల్లేష్ ఉన్నారు.

కోదాడ రూరల్: మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో రేవూరి పరబ్రహ్మం మృతిచెందారు. శనివారం వారి భౌతిక కాయానికి పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇర్ల సీతారాంరెడ్డి, రేవూరి వెంకటాచారి పాల్గొన్నారు.

వెంపటి పాఠశాలలో బాలసభ

తుంగతుర్తి, జూలై 27: మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో భారత కార్యక్రమం నిర్వహించారు. నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థుల నాయకత్వంలో బాలసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పాలకుర్తి యల్లయ్య, ఉపాధ్యాయ బృందం మల్లెపాక రవీందర్, ఆంజనేయులు రమాదేవి, అబ్బగాని మంజుల పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కోదాడ రూరల్, జూలై 27: ఐఐటీలో సీటు సాధించిన మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థి భూక్యా ఆనంద్ సాయిని పాఠశాలలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జటావత్ రవీందర్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మునగాల రూరల్, జూలై 27: మండల పరిధిలోని తాడ్వాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి కిరణ్ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. అతనికి సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ. 16,500 చెక్కును శనివారం కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి వెంకటేశ్వర్లు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీనివాస్, మాతంగి వెంకన్న, ఆలేటి గురుప్రసాద్, కోట పాపయ్య, వెంకన్న, మాతంగి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూము తీసిన వ్యక్తిపై కేసు నమోదు

మద్దిరాల, జూలై 27: అధికారుల అనుమతి లేకుండా చెరువు తూము తెరిచి నీటిని విడుదల చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధునాయుడు శనివారం తెలిపారు. మద్దిరాల మండల పరిధిలోని చిననెమిల గ్రామ పరిదిలోని పెద్ద చెరువు తూమును బెత్తం లింగయ్య నీటిని విడుదల చేశారని ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.